రహదారికి మహర్దశ



నాడు : అధ్వానంగా నిడదవోలు–తాడేపల్లిగూడెం ఆర్‌అండ్‌బీ ప్రధాన రహదారి



నేడు : పనులు జరుగుతున్న నిడదవోలు–తాడేపల్లిగూడెం ప్రధాన రహదారి

- నిడదవోలు–తాడేపల్లిగూడెం రోడ్డు అభివృద్ధి
- పూర్తి కావస్తున్న పనులు

నిడదవోలు: గోతులమయంగా ఉన్న ప్రధాన రహదారికి మహర్దశ పట్టింది. ఎన్నో ఏళ్ల తర్వాత అభివృద్ధికి నోచుకుంది. ప్రయాణికుల కష్టాలు తీరనున్నాయి. పట్టణంలోని రైల్వేగేటు నుంచి తాడేపల్లిగూడెం వెళ్లే ఆర్‌అండ్‌బీ ప్రధాన రహదారి అభివృద్ధికి నిధులు మంజూరయ్యాయి. పనులు కూడా జరుగుతున్నాయి. గతంలో ఈ రహదారి అధ్వానంగా ఉండేది. ఎక్కడపడితే అక్కడ గోతులు పడి ప్రయాణికులు నానా ఇబ్బందులకు పడేవారు. వర్షాకాలంలో గోతుల్లో నీరు చేరడంతో ప్రమాదాలకు గురయ్యేవారు. వాహనాలకు కూడా పలుమార్లు మరమ్మతులకు గురయ్యేవి. రాజమహేంద్రవరం, కొవ్వూరు, పంగిడి, దేవరపల్లి ప్రాంతాలకు ఈ రోడ్డు ప్రధానమైంది. నిత్యం వందలాది వాహనాలు రాకపోకలు సాగిస్తుంటాయి. నిడదవోలు నుంచి తాడేపల్లిగూడెం, ఏలూరు, విజయవాడ ప్రాంతాలకు ఆర్టీసీ సర్వీసులు నడపాలంటే ఈ రోడ్డు గతి. పంగిడి, దేవరపల్లి నుంచి క్వారీ లారీలు వందల్లో తిరగడంతో రోడ్డు పూర్తిగా దెబ్బతింది. 6 కిలోమీటర్లు ఉన్న ఈ రోడ్డు అడుగడుగునా గోతులు ఉండడంతో ప్రయాణికులు ఇబ్బంది పడేవారు. ప్రయాణికుల ఇబ్బందులను తొలగించేందుకు ప్రభుత్వం ఆర్‌అండ్‌బీ నిధులు రూ.4.50 కోట్లు మంజూరు చేసింది. పట్టణంలోని నెహ్రూబొమ్మ సెంటర్ నుంచి బసివిరెడ్డిపేట, శెట్టిపేట, తాళ్లపాలెం గ్రామాల మీదుగా తాడేపల్లిగూడెం మండలం నందమూరి బ్రిడ్జి వరకూ నిర్మాణ పనులు దాదాపు పూర్తికావస్తున్నాయి. నిడదవోలు నియోజకవర్గంలోని రహదారుల నిర్మాణాలపై స్థానిక ఎమ్మెల్యే జి.శ్రీనివాసనాయుడు ప్రత్యేక దృష్టి సారించడంతో ప్రధాన రహదారులకు మోక్షం కలిగిందని ప్రయాణికులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

ఘనంగా నేతాజీ జయంతి



కొవ్వూరులో సుభాష్ చంద్రబోస్ చిత్రపటానికి పూలమాల వేస్తున్న సీపీఎం నాయకులు

కొవ్వూరు: నేతాజీ సుభాష్ చంద్రబోస్ జయంతిని సోమవారం పట్టణంలో నిర్వహించారు. సీపీఎం కార్యాలయంలో పట్టణ కార్యదర్శి డి.రాధాకృష్ణ, సీనియర్ నాయకులు పి.గంగాధరరావు బోస్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. స్వాతంత్ర్య పోరాటంలో ఏమాత్రం పాత్రలేని ఆర్‌ఎస్‌ఎస్, బీజేపీలు నేతాజీ జయంతి వేడుకలు చేయడం విడ్డూరంగా ఉందని నాయకులు విమర్శించారు. కె.కనకరావు, వై.ఈశ్వరరావు, కె.నాయుడు, ఎం.సుందర బాబు, ఎం.జ్యోతిబసు తదితరులు పాల్గొన్నారు. పట్టణంలో బీజేపీ కార్యాలయంలో మండల బీజేపీ అధ్యక్షుడు పెరుగు పోతురాజు నేతాజీ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. శ్రీనివాసరావు, ఉమామహేశ్వరరావు, శివకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

తాళ్లపూడి: మండలంలోని పాఠశాలల్లో నేతాజీ జయంతిని నిర్వహించారు. రాగోలపల్లి ప్రాథమిక పాఠశాలలో ప్రధానోపాధ్యాయుడు డి.దుర్గారావు ఆధ్వర్యంలోనూ, తాళ్లపూడిలోని శ్రీవిజేత హైస్కూల్లో పాఠశాల ప్రధానోపాధ్యాయుడు జేవీ ప్రమోద్‌కుమార్ ఆధ్వర్యంలో నేతాజీ చిత్రపటానికి పూలమాలలు వేసి, నివాళులర్పించారు.

చాగల్లు: నేతాజీ సుభాష్ చంద్రబోస్ క్రమశిక్షణ, కృషి, పట్టుదలను విద్యార్థులు స్ఫూర్తిగా తీసుకోవాలని ఎంఈవో వి.ఖాదర్‌బాబు అన్నారు. చాగల్లు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో సోమవారం నేతాజీ జయంతిని నిర్వహించారు.

సారా బట్టీలపై అధికారుల దాడులు

నల్లజర్ల: నల్లజర్ల, గోపాలపురం మండలాల్లోని పలు గ్రామాల్లో సారాబట్టీలపై దాడులు చేసినట్టు దేవరపల్లి ఎస్‌ఈబీ సీఐ డి.సుధ సోమవారం తెలిపారు. నల్లజర్ల మండలం తెలికిచర్లలో కామన శ్రీనివాసరావును అరెస్టు చేసి 60 లీటర్ల సారాను స్వాధీనం చేసుకుని, 400 లీటర్ల బెల్లపు ఊటను ధ్వంసం చేసినట్టు ఆమె తెలిపారు. గోపాలపురం మండలం బుచ్చియపాలెంలో జక్కు కొవ్వాడియ్యను అరెస్టు చేసి 60 లీటర్ల సారాను స్వాధీనం చేసుకుని, 400 లీటర్ల బెల్లపు ఊటను ధ్వంసం చేసినట్టు ఆమె చెప్పారు.

క్లుప్తంగా

కాకరపర్రులో అన్నసమారాధన

పెరవలి: కాకరపర్రు గ్రామ దేవత కనక మహాలక్ష్మి అమ్మవారి జాతర మహోత్సవాల సందర్భంగా ఆదివారం భారీ అన్న సమారాధన నిర్వహించారు. అమ్మవారి జాతర గత వారం రోజులుగా కన్నుల పండువగా జరిగింది. ఈ మేరకు ఆలయ కమిటీ ఆధ్వర్యంలో 12 రకాల కూరలు, పిండి వంటలతో ఘనంగా అన్న సమారాధన నిర్వహించారు. సుమారు 10 వేల మంది హాజరై అన్నప్రసాదాన్ని స్వీకరించారు.

పరిసరాలు శుభ్రంగా ఉంచాలి

ఉండ్రాజవరం: గ్రామంలో ప్రతి ఒక్కరూ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని సర్పంచ్ కె.నరేంద్ర, కార్యదర్శి పి.సత్యనారాయణ అన్నారు. తాడిపర్రులో సోమవారం పారిశుధ్య కార్యక్రమాలు చేపట్టారు. సంక్రాంతి పండగ, గ్రామంలో జాతర కార్యక్రమాలు ముగియడంతో పేరుకుపోయిన చెత్తను తొలగించారు. రోడ్డుకిరువైపులా బ్లీచింగ్ పిచికారీ చేశారు.

యూటీఎఫ్ జిల్లా అసోసియేట్ అధ్యక్షుడిగా రాంబాబు

ఉండ్రాజవరం: యూటీఎఫ్ తూర్పు గోదావరి జిల్లా దివాన్ చెరువులో ఆదివారం జరిగిన జిల్లా నూతన కౌన్సిల్ సమావేశంలో మండల యూటీఎఫ్ నుంచి పలువురు ఉపాధ్యాయులు జిల్లా యూటీఎఫ్‌కు ఎంపికైయ్యారు. జిల్లా అసోసియేట్ అధ్యక్షుడిగా ఐ.రాంబాబు, జిల్లా ఆడిట్ కమిటీ మెంబర్‌గా బెజ్జంకి రామారావు, సీపీఎస్ కమిటీ మెంబర్‌గా కె.రామకృష్ణ ఎనికైయ్యారు. వీరికి సోమవారం మండల యూటీఎఫ్ అధ్యక్షుడు కె.వెంకటరత్నం, ప్రధాన కార్యదర్శి దువ్వాప రామారావు, కమిటీ సభ్యులు, ఉపాధ్యాయులు అభినందనలు తెలిపారు.

ఒకటిన జిల్లా మహాసభలు

నిడదవోలు: నిడదవోలులో వచ్చే నెల ఒకటో తేదీన జరగనున్న ఐఎఫ్‌టీయూ 7వ జిల్లా మహాసభలను విజయవంతం చేయాలని ఐఎఫ్‌టీయూ జిల్లా అధ్యక్షుడు కేవీ రమణ కోరారు. పట్టణంలోని టౌన్‌హాలులో సోమవారం సభలను సంబంధించి సన్నాహక సమావేశాన్ని నిర్వహించారు. ఈకార్యక్రమంలో ఐఎఫ్‌టీయూ నాయకులు ఈమని గ్రీష్మకుమార్, తీపర్తి వీర్రాజు, వివిధ సంఘాల నాయకులు పాల్గొన్నారు.

భూముల రీసర్వే



వేగేశ్వరపురంలో విటాల్ డ్రోన్ ప్రారంభిస్తున్న దృశ్యం

తాళ్లపూడి: వేగేశ్వరపురంలో సోమవారం జగనన్న సంపూర్ణ భూ హక్కు పథకంలో భాగంగా విటాల్ డ్రోన్ సాయంతో సర్వే పూర్తి చేశారు. రెండు రోజులపాటు గ్రామంలో 2,600 ఎకరాలు రీ సర్వే చేసినట్టు అధికారులు తెలిపారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ కొమ్మిరెడ్డి వరకు రామారావు, రీ సర్వే డిప్యూటీ తహసీల్దార్ భారతి, పంచాయతీ కార్యదర్శి డీఎస్ సి.శ్రీనివాస్, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

సబ్‌ప్లాన్ చట్టం కాలపరిమితి పెంపుపై హర్షం

నిడదవోలు రూరల్: ఎస్సీ, ఎస్టీ సబ్‌ప్లాన్ చట్టాన్ని పునరుద్ధరిస్తూ ప్రభుత్వం జీఓ తీసుకురావడం అభినందనీయమని కుల నిర్మూలన పోరాట సమితి (కేఎన్‌పీఎస్) జిల్లా ప్రధాన కార్యదర్శి గెద్దం రవీంద్రబాబు అన్నారు. మండలంలోని సమిశ్రగూడెంలో ఆయన సోమవారం విలేకరులతో మాట్లాడుతూ 2013లో సబ్‌ప్లాన్ చట్టం పదేళ్ల కాల పరిమితితో అమలులోకి వచ్చిందన్నారు. 2023లో గడువు ముగుస్తుండడంతో ప్రభుత్వం ఈ చట్టాన్ని పునరుద్ధరిస్తూ ఆర్డినెన్స్ తీసుకురావడంతోపై సీఎం వైఎస్ జగన్‌కు ధన్యవాదాలు చెప్పారు.

నల్లజర్ల ఎస్సైగా నరసింహమూర్తి



నల్లజర్ల: స్థానిక ఎస్సైగా బి.నరసింహమూర్తి సోమవారం బాధ్యతలు స్వీకరించారు. 2009 బ్యాచ్‌కు చెందిన ఆయన రాజమహేంద్రవరం స్పెషల్ బ్రాంచి నుంచి ఇక్కడకు వచ్చారు.

యూటీఎఫ్ కార్యదర్శిగా రవి

తాళ్లపూడి: యూటీఎఫ్ తూర్పుగోదావరి జిల్లా కార్యదర్శిగా మండలానికి చెందిన ఎం.రవిని ఎన్నుకున్నారు. గతంలో ఆయన మండల అధ్యక్షుడిగా పనిచేశారు. రవి ఎంపికపై యూటీఎఫ్ నాయకులు బి.విజయబాబు, నాగేశ్వరరావు, క్రాంతికుమార్, శ్రీనివాస్, రమేష్, రాజారావు, రాజకుమారి అభినందనలు తెలిపారు.

27న మునిసిపల్ కౌన్సిల్ బడ్జెట్ సమావేశం

కొవ్వూరు: మునిసిపల్ కౌన్సిల్ సమావేశం ఈనెల 27వ తేదీన నిర్వహించనున్నట్లు చైర్‌పర్సన్ భావన రత్నకుమారి తెలిపారు. ఈ సమావేశంలో పట్టణంలో చేపట్టే వివిధ అంశాలపై సమీక్ష, 2023–24 బడ్జెట్ సమావేశం ఉంటుందని తెలిపారు.

బాధితుడికి ఆర్థిక సాయం

నల్లజర్ల: ప్రకాశరావుపాలెంలో ఇటీవల బైక్ ప్రమాదంలో గాయపడి ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న ఐషీర్ కుటుంబానికి ఆ గ్రామానికి చెందిన మదర్ థెరిస్సా సేవా సమితి రూ.11,150 ఆర్థిక సాయాన్ని సోమవారం అందజేశారు.

ముఖ్యమంత్రి చిత్రపటానికి క్షీరాభిషేకం



సీఎం జగన్ చిత్రపటానికి క్షీరాభిషేకం చేస్తున్న ఇళ్ల భాస్కరరావు తదితరులు

గోపాలపురం: రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అతిరాస కులస్తులకు సముచిత స్థానం కల్పించి రాష్ట్రంలో ఉన్న 56 ఉపకులాలకు తగిన న్యాయం చేశారని రాష్ట్ర అతిరాస కార్పొరేషన్ చైర్మన్ ఇళ్ల భాస్కరరావు అన్నారు. రేగులగుంటలోని ఆయన స్వగృహం వద్ద సోమవారం అతిరాస కులస్తులు, రాష్ట్ర కమిటీ డైరెక్టర్లు కలిసి సీఎం చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. ఈ సందర్భంగా చైర్మన్ ఇళ్ల భాస్కరరావు మాట్లాడుతూ రెండోసారి రాష్ట్ర అతిరాస కార్పొరేషన్‌కు చైర్మన్, డైరెక్టర్లను ఎంపిక చేయడం అభినందనీయమన్నారు. రాష్ట్ర ముఖ్యమంత్రి, రాజమండ్రి ఎంపీ మార్గాని భరత్ రామ్, గోపాలపురం ఎమ్మెల్యే తలారి వెంకట్రావులకు చైర్మన్ కమిటీ సభ్యులు కృతజ్ఞతలు తెలియజేశారు. డైరెక్టర్లు, తెలే వెంకటేశ్వరరావు, బుర్రి రమణ, బుర్రి మంగతాయారు, సత్యవాణి అతిరాస కులస్తులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి తీవ్ర గాయాలు

కొవ్వూరు: ఈనెల 21వ తేదీ రాత్రి పశివేదల గ్రామానికి చెందిన నారాయణ మోటారుసైకిల్‌పై వస్తుండగా పట్టణ శివారున నందమూరు రోడ్డు ఎంవీఐ ఆఫీసు సమీపంలో కారు ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో నారాయణకు తీవ్ర గాయాలయ్యాయి. స్థానికులకు 108లో కొవ్వూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అక్కడి నుంచి మెరుగైన వైద్యం కోసం రాజమహేంద్రవరంలోని ప్రైవేటు ఆసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ సోమవారం ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు పట్టణ ఎస్సై బి.దుర్గా ప్రసాద్ తెలిపారు.

ఆర్టీసీ బస్సు ఢీకొని...

నిడదవోలు రూరల్: మునిపల్లి వద్ద ఆర్టీసీ బస్సు ఢీకొని వ్యక్తికి తీవ్రగాయాలయ్యాయి. స్థానికుల వివరాల ప్రకారం.. సోమవారం కానూరు నుంచి నిడదవోలు వైపు బైక్‌పై వస్తున్న వ్యక్తిని రాజమహేంద్రవరం నుంచి తణుకు వైపు వెళుతున్న ఆర్టీసీ బస్సు ఢీకొట్టింది. దీంతో తీవ్ర గాయాలైన మోటారుసైకిస్టును రాజమహేంద్రవరం ఆసుపత్రికి తరలించారు. వ్యక్తి వివరాలు తెలియాల్సి ఉందని సమిశ్రగూడెం పోలీసులు తెలిపారు.

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

చాగల్లు: చికిత్స పొందుతూ ఒక వ్యక్తి మృతి చెందినట్టు ఏఎస్సై ఎస్‌కే హుస్సేన్ సోమవారం తెలిపారు. చాగల్లు గ్రామానికి చెందిన గొల్లా పోసియ్య(30)మద్యానికి బానిసై తరచూ మద్యం తాగుతూ ఇంటికి వస్తుంటాడు. మద్యం తాగొద్దని కుటుంబ సభ్యులు చెప్పగా, వారిని బెదిరించేందుకు ఈ నెల 19వ తేదీన ఒంటిపై పెట్రోలు పోసుకుని నిప్పు అంటించుకొన్నాడు. ఈ ఘటనలో తీవ్ర గాయాలయ్యాయి. పోసియ్యను వైద్యం కోసం రాజమండ్రి ప్రభుత్వ ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందినట్టు ఏఎస్సై తెలిపారు. తల్లి నాగలక్ష్మి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు చెప్పారు.

గుర్తు తెలియని వృద్ధుడి ...

దేవరపల్లి: రాజమహేంద్రవరం ప్రభుత్వ ఆసుపత్రిలో 85ఏళ్ల గుర్తు తెలియని వృద్ధుడు చికిత్స పొందుతూ ఆదివారం రాత్రి మృతి చెందాడు. పోలీసుల కథనం ప్రకారం.. గౌరీపట్నం శివారు కొండగూడెం బస్‌స్టాప్ వద్ద వృద్ధుడు సుమారు నెల రోజుల నుంచి ఉంటున్నాడు. రెండు రోజుల నుంచి అనారోగ్యంతో ఉంటూ లేవలేని స్థితిలో ఉన్నట్టు వచ్చిన సమాచారం మేరకు ఈ నెల 18న వృద్ధుడిని చికిత్స కోసం 108లో రాజమండ్రి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. చికిత్స పొందుతూ ఆదివారం రాత్రి మృతి చెందినట్టు వైద్యులు తెలిపారని ఎస్సై కె.శ్రీహరిరావు తెలిపారు. వృద్ధుడి ఆచూకీ తెలిసిన వారు 08813273533, 9440796624 నంబర్లకు ఫోన్ చేసి చెప్పవచ్చని ఆయన కోరారు.

వ్యక్తి అదృశ్యం

కొవ్వూరు: మద్దూరు గ్రామానికి చెందిన షేక్ మస్తాన్ బీబీ తన భర్త సైయద్ బాజీ ఈనెల 20వ తేదీ నుంచి కనిపించడం లేదని ఇచ్చిన ఫిర్యాదుపై కేసు నమోదు చేసినట్టు రూరల్ ఏఎస్సై వై.శ్రీనివాసరావు తెలిపారు. మోటారుసైకిల్‌పై తనను గోవవరంలో హోటల్ వద్ద దింపి ధవళేశ్వరం వెళ్లి వస్తానని చెప్పి వెళ్లి తిరిగిరాదు. 21న ఫోన్ చేస్తే అతను చనిపోతున్నట్టు చెప్పి ఫోన్ స్విచ్ ఆఫ్ చేసినట్టు ఆమె ఫిర్యాదులో పేర్కొందని ఏఎస్సై తెలిపారు. పలు చోట్ల వెతికినప్పటికీ అతని ఆచూకీ లభ్యం కాకపోవడంతో సోమవారం ఫిర్యాదు చేసినట్టు ఏఎస్సై తెలిపారు.

పిల్లల వికాసానికి కృషి చేయాలి



బాలికల నృత్య ప్రదర్శన

పెరవలి: పిల్లల మనో వికాసానికి ఉపాధ్యాయులతో పాటు తల్లిదండ్రులు కూడా బాధ్యత తీసుకోవాలని అప్పుడే వారి లక్ష్యాలను చేరుకుంటారని రామకృష్ణ సేవా సమితి ప్రధాన కార్యదర్శి సివి ప్రసాద్ పేర్కొన్నారు. కానూరులో రామకృష్ణ సేవా సమితి ఆధ్వర్యంలో స్వామీ వివేకానంద జయంతిని ఆదివారం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ యువత, చిన్నారుల మనో వికాసమే ధ్యేయంగా పని చేస్తున్నప్పుడే ఉన్నత స్థితికి వెళతారని, అంతే కాకుండా సమాజంపై బాధ్యతగా వ్యవహరిస్తారని తెలిపారు. ఈ సందర్భంగా విద్యార్థులతో పలు కార్యక్రమాలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో వివేకానంద ప్రచార పరిషత్ కన్వీనర్ అమిరపు నటరాజన్, తిరుపతి, రాజమండ్రి రామకృష్ణ సేవా సమితి కన్వీనర్లు గంగవరపు శ్రీదేవి, తరుణవీరానంద మహారాజ్, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

సేవారత్న పురస్కారాల ప్రదానం

నల్లజర్ల: దూబచర్లలో లయన్స్‌క్లబ్ అధ్యక్షుడు అంబటి శ్రీనివాసరావు, ఉపాధ్యాయుడు బొందల శ్రీనివాసరావు చేస్తున్న సేవా కార్యక్రమాలకు హైదరాబాదుకు చెందిన రుద్రాస్టూడియోస్ వారి ఆధ్వర్యంలో న్యూ టాలెంట్ అవార్డు కార్యక్రమాల్లో భాగంగా ఆ సంస్థ సేవారత్న పురస్కారాలతో వీరిని సత్కరించింది. ఆదివారం హైదరాబాదు సత్యసాయి నిగమంలో జరిగిన ఈ వార్డుల ప్రదానం జరిగినట్టు దూబచర్ల లయన్స్ క్లబ్ అధ్యక్షుడు అంబటి శ్రీనివాసరావు తెలిపారు. ఉభయ తెలుగు రాష్ట్రాలలో వివిధ రంగాల్లో సేవలు అందించిన 150 మందిని సత్కరించగా వారిలో అంబటి శ్రీనివాసరావు, బొందల శ్రీనివాసరావు ఉన్నారు. వీరిని సినీనటుడు సమీర్, రాగిణి, జబర్దస్త్ అప్పారావు సత్కరించినట్టు చెప్పారు.

రగ్గులు, పండ్ల పంపిణీ

ఉండ్రాజవరం: టీడీపీ పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్ పుట్టిన రోజు సందర్భంగా వేలివెన్నులో మాజీ ఎమ్మెల్యే బూరుగుపల్లి శేషారావు ఆధ్వర్యంలో కేక్ కట్ చేశారు. పాలంగిలో స్పందన మానసిక, దివ్యాంగుల ఆశ్రమంలో రగ్గులు, పండ్లు, భోజనం పంపిణీ చేశారు.

క్రికెట్ కెప్టెన్ ప్రవీణ్ వితరణ



కిడ్నీ బాధితుడికి చెక్కు అందజేస్తున్న ప్రవీణ్

గోపాలపురం: సంక్రాంతి సందర్భంగా ఆర్‌అండ్‌ఎం ఫౌండేషన్ ఆధ్వర్యంలో వేళ్లచింతలగూడెంలో నిర్వహించిన క్రికెట్ పోటీలలో ప్రథమ బహుమతి సాధించిన ప్రవీణ్ ఫాంటస్ జట్టు కెప్టెన్ వి.ప్రవీణ్‌ప్రదీప్‌రెడ్డి తాను గెలిచిన రూ.1.50లక్షలను దివ్యాంగులు, ఆపదలో ఉన్నవారికి అందజేస్తున్నట్టు తెలిపారు. సోమవారం వేళ్లచింతలగూడెంలో దివ్యాంగుడు పరిమి అంజనేయులుకు రూ.15వేలు, గొల్లగూడెంలో డయాలసిస్ వ్యాధి బాధితుడికి రూ.10వేల ఆర్థిక సాయం అందజేశారు. గత నాలుగు సంవత్సరాలుగా క్రికెట్ పోటీల్లో గెలుపొందిన సుమారు రూ.25లక్షల వరకూ ఆపదలో ఉన్నవారిని గుర్తించి ఆర్థిక సహాయం చేస్తున్నట్టు ప్రవీణ్ తెలిపారు.

లైసెన్స్ లేకుంటే చర్యలు

కొవ్వూరు: లైసెన్స్ లేకుండా వాహనాలు నడపడం నేరమని మోటారు వెహికల్ ఇన్‌స్పెక్టర్ బి.భీమారావు సూచించారు. పట్టణంలో ఏబీఎన్ అండ్‌పీఆర్‌ఆర్ కళాశాలలో సోమవారం రోడ్డు భద్రతా వారోత్సవాల్లో భాగంగా విద్యార్థులకు అవగాహన సదస్సు నిర్వహించారు. సెల్‌ఫోన్‌లో మాట్లాడుతూ డ్రైవింగ్ చేయడం ప్రమాదకరమని, ట్రాఫిక్ నిబంధనలు కచ్చితంగా పాటించాలని కోరారు. ఇ అసిస్టెంట్ ఎంవీఐ ఎండీ జమీర్, అధ్యాపకులు వై.రమేష్ తదితరులు పాల్గొన్నారు.

జాతీయ స్థాయి ఫుట్‌బాల్ పోటీలకు విద్యార్థుల ఎంపిక

నల్లజర్ల: జాతీయ స్థాయిలో జరుగనున్న స్కూల్‌గేమ్స్ అండర్–14 ఫుట్‌బాల్ బాల, బాలికల జట్టను ఎంపిక చేసినట్టు స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ జిల్లా కార్యదర్శి బి.జాన్సన్ తెలిపారు. ఈనెల 20వతేదీన నుంచి 22 వరకూ తెలికిచెర్ల శివారులోఉన్న ఢిల్లీ పబ్లిక్ స్కూలులో నిర్వహించిన 66వ రాష్ట్ర స్థాయి అంతర్ జిల్లాల అండర్–14 విభాగం బాలబాలికలు ఫుట్‌బాల్ పోటీల్లో ప్రతిభకనబరిచారు. జరిగిన పోటీల్లో కడప, అనంతపురం, నెల్లూరు, గుంటూరు, శ్రీకాకుళం, విజయనగరం, కర్నూలు, చిత్తూరు, విశాఖపట్టణం, పశ్చిమగోదావరి జిల్లాల విద్యార్థులు పాల్గొన్నారు. పశ్చిమగోదావరి జిల్లా జట్టుకు కె.బలరాం, పి.యోహిత్, సీహెచ్ మోహిత, ఆర్.రాఘువేంద్ర, దీపిక, ఎ.సాయి, గణస్వరూప, సుష్మిత ఎంపికయ్యారు. వీరు ఏప్రిల్ జరగనున్న జాతీయస్థాయి అండర్–14 ఫుట్‌బాల్ పోటీల్లో పాల్గొంటారని తెలిపారు.

కొవ్వూరు: పట్టణంలో ప్రభుత్వ ఉన్నత పాఠశాలకు చెందిన జె.సుష్మిత స్కూల్ గేమ్స్‌లో అండర్–14 బాలికల విభాగంలో జాతీయ స్థాయి ఫుట్‌బాల్ పోటీలకు ఎంపికైనట్టు ప్రధానోపాధ్యాయుడు, డీవైఈవో ఎం.తిరుమలదాసు తెలిపారు.

ప్రభుత్వ ఉత్తర్వులు అమలు చేయడం లేదు

స్పందనలో ఓ ఉపాధ్యాయిని ఫిర్యాదు

నల్లజర్ల: ఎయిడెడ్ పాఠశాలల ఉపాధ్యాయులకు పదవీ విరమణ వయస్సు 62కు పెంచుతూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసినా పోతవరంలో వివేకానంద ఎయిడెడ్ పాఠశాల యాజమాన్యం మాత్రం ఆ ఉత్తర్వులను అమలు చేయడం లేదంటూ ఆ పాఠశాలలో పదవీ విరమణ చేసిన కె.సుగుణకుమారి స్పందన కార్యక్రమంలో ఫిర్యాదు చేశారు. డీఈఓ, ఎంఈఓ ఉత్తర్వులను సైతం పట్టించుకోవడంలేదని తెలిపారు. డిసెంబరు17వ తేదీ నుంచి పాఠశాలకు వెళ్లి తాను సొంతంగా తెచ్చుకున్న అటెండెన్స్ రిజిస్టర్‌లో సంతకం చేస్తున్న అక్కడ హెచ్‌ఎం గానీ కరస్పాండెంట్‌గానీ జాయినింగ్ రిపోర్టు ఇవ్వడం లేదని, కనీసం విద్యార్థులకు పాఠాలు చెప్పనివ్వడం లేదన్నారు. గత వారం స్పందనలో ఫిర్యాదు చేయడంతో 9వ తేదీన మండల విద్యాశాఖాధికారి శ్రీనివాసరావు పాఠశాలకు వెళ్లి ఉపాధ్యాయుల హాజరుపట్టీలో జాయిన్ చేసుకొని జాయినింగ్ రిపోర్టు పంపమని ఆదేశించినా ఇంతవరకు జాయిన్ చేసుకోలేదు. 12వ తేదీన విద్యాశాఖ అధికారులు ముఖచిత్ర హాజరుకు అనుమతించినట్టు చెప్పారు. పాఠశాల కరస్పాండెంటుతో జాయినింగ్ రిపోర్టు ఇప్పించాలని సుగుణకుమారి అధికారులకు విజ్ఞప్తి చేశారు.

వాసవీ కన్యకా పరమేశ్వరికి పూజలు



అమ్మవారికి పూజలు చేస్తున్న వాసవీ వనితా క్లబ్ మహిళలు

కొవ్వూరు: పట్టణంలో ఆర్యవైశ్య కల్యాణ మండపంలో శ్రీవాసవీ కన్యకా పరమేశ్వరి ఆత్మార్పణ దినోత్సవం సందర్భంగా వాసవీ మాతకు విశేష పూజలు నిర్వహించారు. సోమవారం ఉదయం 108 కలశాలతో గోష్పాద క్షేత్రం నుంచి మేళతాళాలతో గోదావరి జలాలు తీసుకొచ్చి వాసవీ మాతకు అభిషేకాలు చేశారు. అనంతరం ఆత్మార్పణ హోమం, కుంకుమ సమర్పించారు. ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడు మద్దుల సోమరాజు, నాళం వీరవెంకటశ్రీనివాసరావు, పలివేటి రామకృష్ణకుమార్, మద్దుల వీరవెంకట సత్యనారాయణ, మానేపల్లి హరినాథ్ సుబ్బారావు, కంచర్ల వీరవెంకట కృష్ణప్రసాద్, కక్కిరాల వీరభద్రరావు,ఖండవల్లి వీరవెంకట సత్యనారాయణ, కురిశేటి శ్రీనివాస్, పెరుమాళ్ల అచ్యుతరామారావు దంపతులు పాల్గొన్నారు.

వైభవంగా ఆత్మార్పణ దినోత్సవం

నిడదవోలు : స్థానిక చినకాశిరేవులో ఉన్న వాసవీ కన్యకా పరమేశ్వరి అమ్మవారి ఆలయంలో సోమవారం నిడదవోలు వాసవీ వనితా క్లబ్ ఆధ్వర్యంలో ఆత్మార్పణ దినోత్సవాన్ని నిర్వహించారు. అమ్మవారికి ప్రత్యేక కుంకుమ పూజలు చేశారు. అమ్మవారికి 102 దీపాలు వెలిగించి పసుపు, కుంకుమ, గాజులు, నూతన దుస్తులు సమర్పించారు. పేద ఆర్య వైశ్య మహిళలకు ఆర్థిక సహకారం అందజేశారు. ఈ కార్యక్రమంలో వాసవీ వనితా క్లబ్ అధ్యక్షురాలు దివ్వెల ఫణిమాధురి, కోశాధికారి జవ్వాది శిరిష, ఉపాధ్యక్షురాలు ఉదయగిరి మణి, కేదారిశెట్టి సునీత, జయవరపు లక్ష్మి, నాగపుష్పావతి, ఉద్దగిరి సత్యవతి తదితరులు పాల్గొన్నారు.

బీమా సొమ్ము అందజేత

నిడదవోలు రూరల్: బాధిత కుటుంబాలకు వైఎస్సార్ బీమా అండగా నిలుస్తోందని వైఎస్సార్ సీపీ గ్రామ, సొసైటీ అధ్యక్షుడు గజ్జరపు శ్రీరమేష్ అన్నారు. సమిశ్రగూడెంలో ఇటీవల మృతి చెందిన సాలి జగపతిరావు కుటుంబ సభ్యులకు రూ.10 వేలు తక్షణ ఆర్థిక సహాయాన్ని సోమవారం అందజేశారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నాయకులు అంగర శ్రీను, దేశాబత్తుల నాగు, వడల అంబేడ్కర్, వార్డు సభ్యుడు ప్రతాప్, వెల్ఫేర్ అసిస్టెంట్ భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.